బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మండల నాయకులు

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ శ్రేణులు

లింగాలఘనపురం, మార్చి 3 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మండలంలోని పార్టీ నాయకులు ఆదివారం రాత్రి ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌లో కలిశారు. స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని రాజయ్యతో కలిసి వారు వెళ్లారు. ఈ సందర్భంగా రాజయ్యను పార్టీ అధినేత కేసీఆర్ ఆశీర్వదించారు. మండలంలో పార్టీ స్థితిగతులు, బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరిన విషయాన్ని వివరించారు. పార్టీ శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షురాలు గండి మంగమ్మ, 'దిశ' మాజీ డైరెక్టర్ ఉడుగుల భాగ్యలక్ష్మి, ఎస్సీ సెల్ మండల బాధ్యులు గట్టగల్ల శ్రీహరి, గాదెపాక విష్ణు, మబ్బు కరుణాకర్, గండి చంద్రశేఖర్, మమత పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమాకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ చౌరస్తా, మార్చి 3 : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ హైదరాబాద్‌లో 2025–26 విద్యా సంవత్సరానికిగాను చేనేత టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుకు అర్హులైన అభ్యర్థులు శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి చౌడేశ్వరి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కోర్సులో 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఏప్రిల్ మొదటి వారంలోగా తమ దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఓఎస్డీ హిమజా కుమార్‌ను సెల్ నంబర్ 9030079242లో సంప్రదించాలన్నారు.

ఆట వస్తువులు అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

హైస్కూల్ విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ

నర్మెట, మార్చి 3: మండలంలోని మచ్చుపహాడ్ ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నల్ల యాదగిరిరెడ్డి ఆట వస్తువులను అందించారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. సెల్‌ఫోన్లు, ఆన్‌లైన్ గేమ్స్ కాకుండా శారీరక శ్రమతో కూడిన ఆటలను ఆడాలని సూచించారు. రీజినల్ మీట్ చైర్మన్ పెద్ది రాజిరెడ్డి, హెచ్ఎం గోపాల్‌రెడ్డి, లయన్స్ క్లబ్ డైరెక్టర్లు రేపూరి రమణారెడ్డి, పట్ల రవీందర్‌రెడ్డి, సుభాష్, రవినాయక్, విజయ్‌కుమార్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

6 నుంచి బుగులు వెంకన్న బ్రహ్మోత్సవాలు

చిల్పూరు, మార్చి 3 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు తెలిపారు. వేడుకల్లో భాగంగా స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. భక్తుల కోసం ఆలయ ఆవరణలో మొరం పోసి చదును చేయడం తోపాటు విద్యుత్, నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డైరెక్టర్లు గనగోని రమేశ్‌గౌడ్, వేముల వెంకటేశ్వర్లు ఆలయ పూజారి సౌమిత్రీరంగాచార్యులు, సిబ్బంది వెంకన్న, విష్ణు, మహేశ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కరాటేలో ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులు

కరాటే పోటీల్లో జనగామ విద్యార్థుల ప్రతిభ

జనగామ చౌరస్తా, మార్చి 3 : కాజీపేటలోని ఫాతిమా కమ్యూనిటీ హాల్లో ఆదివారం వీవీకే ఓరుగల్లు ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ వీ నాగ మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ 2025 పోటీల్లో జిల్లాకు చెందిన న్యూ స్టార్ చైనీస్ కుంగ్ ఫూ అకాడమీ విద్యార్థులు ప్రతిభకనబర్చారు. 14 ఇయర్స్ కటాస్ అండ్ స్పారింగ్ విభాగంలో దైవిక్, గౌతమ్ గోల్డ్ మెడల్ సాధించగా, 12 ఇయర్స్ కటాస్ విభాగంలో శ్రీనివాస్ గోల్డ్ మెడల్, సంకీర్తన్ సిల్వర్ మెడల్ సాధించినట్లు న్యూ స్టార్ కుంగ్ ఫూ అకాడమీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాస్టర్ గుగ్గిళ్ల దేవేందర్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ సలీం అభినందిస్తూ ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మాస్టర్స్ అన్వర్, సలీం పాషా, రామ్మోహన్, సారయ్య, మైపూజ్, రవీందర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
jobs Apply Now!
★లేడీ టెలికాలర్స్, బ్యాగ్రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

రఘునాథపల్లి, మార్చి 3: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి పై కేసునమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుర్చపల్లికి చెంది న దేవసాని శ్రీహరి తన కిరాణా షాపులో ఎలాంటి అనుమతులు లేకుండా సుమారు రూ.20 వేల విలువైన మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నాడు. మద్యం ప్రియులతో ఇబ్బందులు కలిగిస్తున్నాడనే సమాచారంతో సోమవారం పోలీసులు తనిఖీ చేశారు. కిరాణా షాపులో మద్యం ఉన్నట్లు గుర్తించి దేవసాని శ్రీహరిపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

మున్సిపాలిటీలో ఎక్కడి సమస్యలు అక్కడే

- జీపీ నుంచి పురపాలక సంఘంగా మారిన స్టేషన్‌ఘన్‌పూర్..
- పలు కాలనీవాసుల్లో ఇళ్ల ముందే పారుతున్న మురుగునీరు
- అస్తవ్యస్త డ్రైనేజీలతో పాట్లు

ఇళ్లముందు పారుతున్న మురుగునీటిలో నుంచి వెళ్తున్న స్థానికులు

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 3 : లక్షలు వెచ్చించి ఇండ్లు నిర్మించుకున్నా పరిసరాల్లోకి మురుగు నీరు చేరుతున్నది. పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో దుర్గంధం వెలువడుతున్న దుస్థితి స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీలో నెలకొంది. ఫలితంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గతంలో మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న స్టేషన్ ఘన్‌పూర్ గత జనవరి 27న మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. స్టేషన్‌ఘన్‌పూర్‌లో శివునిపల్లి, చాగల్ గ్రామాలను విలీనం చేశారు. మొత్తంగా మూడు గ్రామాలతో కలిపి సుమా రు 24 వేల జనాభా ఉండడంతో పురపాలక సంఘంగా అవతరించింది. అయితే పలు కాలనీల్లో మురుగు కాల్వలు లేవు. దీంతో డ్రైనేజీ నీరు వీధుల్లోకి వస్తున్నది. మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డు(అయ్యగారి ప్లాట్లు)లో ప్రభుత్వాసుపత్రి నుంచి, తిరుమలనాథ స్వామి ఆలయం గుట్ట ప్రాంతాలకు చెందిన ఇళ్ల నుంచి మురుగునీరు వీధుల్లోకి వస్తున్నది. 15, 3 వార్డుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో తమ ఇంటి పరిసరాలకు మురుగునీరు చేరి దుర్గంధం వెలువడుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై గతం లో గ్రామ పంచాయతీలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేరని తెలిపారు. ప్రస్తుతం మున్సిపాలిటీగా మారి రెండు నెలలవుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తున్నది.

దుర్గంధంతో భోజనం చేయలేకపోతున్నం..

లక్షలు ఖర్చు చేసి ఇల్లు కట్టుకున్నాం. కాని ఇంట్లోకి దుర్గంధం వస్తుండడంతో భోజనం చేయలేకపోతున్నాం. మా ఇంటికి బంధువులు ఎవరూ రావడం లేదు, సాయంత్రం వేళ ఇంటి ముందు కూర్చోవడానికి కూడా ఇబ్బందిపడుతున్నం. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఇంటి పన్ను చెల్లించాం. ఇప్పుడు మున్సిపాలిటీగా మారినా అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. మురుగు నీరు కారణంగా స్కూల్ బస్సు ఇక్కడికి రావడం లేదు. అధికారులు స్పందించకుంటే ఆందోళన చేస్తాం.
– సయ్యద్ రబ్బాని, 8వ వార్డు కాలనీవాసి

ఇళ్ల ముందునుండే మురుగునీరు పారుతోంది..

ఇంటి చుట్టు మురుగు నీరు చేరడంతో పందులు, దోమల బెడద పెరిగింది. దీంతో రోగాల బారిన పడుతున్నాం. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఎన్నిమార్లు చెప్పినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు మున్సిపాలిటీ మారినా పరిస్థితిలో మార్పు లేదు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ప్రతిరోజూ చెత్తను సేకరించేవారు. మున్సిపాలిటిగా మారినా పారిశుధ్య సిబ్బంది వస్త లేరు. ప్రజల సమస్యలపై అధికారులు స్పందించకుంటే మున్సిపల్ ఎదుట ఆందోళన చేస్తాం.
– బొల్లపల్లి శ్రీనివాస్, కాలనీవాసి, స్టేషన్‌ఘన్‌పూర్

'నీట్'కు పరీక్ష కేంద్రాలు గుర్తించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, మార్చి 3 : ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే 'నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్' (నీట్) 2025ను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన పరీక్ష కేంద్రాలను గుర్తించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్లో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మే 4న నిర్వహించే ఎంట్రెన్స్‌కు జిల్లాలో కనీసం 20 తరగతి గదులుండే ప్రభుత్వ పాఠశాల లేదా జూనియర్ కళాశాలను ఎంపిక చేయాలన్నారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలు అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష రాయడానికి అనువుగా ఫర్నీచర్, వెంటిలేషన్, తాగునీరు, సీసీటీవీలు, దివ్యాంగులైన అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా ర్యాంప్ సౌకర్యం ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరీక్ష కేంద్రాలను పరిశీలించి నివేదిక అందజేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో రమేశ్, ఆర్డీవో గోపీ రాం, కలెక్టరేట్ ఏవో మన్సూరి పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టు షాపులను తొలగించాలి

రఘునాథపల్లి మార్చి 3: గ్రామాల్లో విచ్చలవిడిగా వెలిసిన బెల్టుషాపులను తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో ని ర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటికి కొరత ఉండే మో కానీ బెల్టుషాపులకు కొదవలేదన్నారు. మద్యానికి అలవాటుపడిన యువత, మరికొందరు ఆర్థికంగా నష్టపోవడమేగాక ఆరోగ్యంగా దెబ్బతింటున్నారని కొమురయ్య తెలిపారు. దీంతో అనేక కుటుంబాలు చితికిపోతున్నందున ప్రభుత్వం బెల్టుషాపులను తొలగించాలని ఆయన కోరారు.

నర్సరీ వద్ద మాట్లాడుతున్న వసంత

నర్సరీని పరిశీలించిన డీఆర్డీవో

చిల్పూరు, మార్చి 3 : మండలంలోని వెంకటాద్రిపేటలోని నర్సరీని డీఆర్డీవో వసంత సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే వానకాలంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటాలన్నారు. నర్సరీలో మొక్కలు పెంచేలా చూడాలని ఈసీ సింగపురం కిరణ్‌కుమార్‌ను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పిట్టల బాబు, ఏఫ్ఏ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి ఠాణాను తనిఖీ చేసిన జనగామ డీసీపీ

పరీక్షల ఏర్పాట్లపై పర్యవేక్షిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

పాలకుర్తి, మార్చి 3: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను జనగామ డీసీపీ బీ రాజమహేంద్రనాయక్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని డీసీపీ సీఐ, ఎస్సైలకు సూచించారు. ఫిర్యాదు దారుల నుంచి స్వయంగా దరఖాస్తులు తీసుకుని పరిష్కరించాలని సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, ఎస్సై దూలం పవన్‌కుమార్‌కు ఆయన సూచించారు. ఫిర్యాదు దారులతో స్నేహ పూర్వకంగా ఉండాలన్నారు. అనంతరం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఇంటర్ పరీక్షల ఏర్పాట్లను డీసీపీ పరిశీలించారు. భద్రత పరమైన ఏర్పాట్లపై ప్రిన్సిపాల్ సరస్వతితో చర్చించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేస్తామన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి ఆయన భోజనం చేసి దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, ఎస్సైలు దూలం పవన్‌కుమార్, ఎం లింగారెడ్డి, యాకూబ్ హూస్సేన్, యు సృజన్‌కుమార్, చింత రాజు పాల్గొన్నారు.

సాగునీరందించి పంటలను పరిరక్షించాలి

క్షేత్రస్థాయి పరిశీలనలో సీపీఎం నాయకుల డిమాండ్

స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆర్డీవోకు, దేవరుప్పులలో తహసీల్దార్‌కు వినతిపత్రాలు ఇస్తున్న నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 3 : యాసంగి సీజన్లో వేసిన పంటలు దెబ్బతినకుండా సాగునీరందించాలని, ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు సోమవారం స్థానిక ఆర్డీవో డీఎస్ వెంకన్నకు వినతి పత్రం అందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎండిపోతున్న పంటలపై రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి దేవాదుల రిజర్వాయర్ల నుంచి సాగునీరు అందించాలన్నారు. ఎండిపోయిన వరి, మక్కజొన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రం స్టేషన్‌ఘన్‌పూర్‌తోపాటు మల్లన్నగండి, ధర్మసాగర్, అశ్వరావుపల్లి రిజర్వాయర్లకు గోదావరి జలాలు పంపింగ్ చేయాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు స్పందిస్తే పంటలకు సాగునీరు అందుతుందన్నారు. నియోకవర్గంలోని దేవాదుల కాల్వలు చెట్లతో, మట్టితో నిండి ఉన్నాయని, వాటిని క్లియర్ చేసి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య, మండల కార్యదర్శి మునిగెల రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు కొడపాక యాకయ్య, మండల కమిటీ సభ్యులు కత్తుల రాజు, చిలుముల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి

దేవరుప్పుల : యాసంగిలో సాగునీరందక ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ మహిపాల్‌రెడ్డికి వారు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేశ్ మాట్లాడుతూ మండలంలోని అనేక గ్రామాల్లో పరిశీలించగా సాగునీరందక వరి పొలాలు ఎండిపోయాయని తెలిపారు. ఎకరాకు రూ.50 వేల చొప్పున ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రూ. 2 లక్షల పంట రుణమాఫీ చేయాలని, రైతుభరోసా అందించాలని ఆయన కోరారు. దేవాదుల రిజర్వాయర్ల నుంచి సాగునీరు వదిలి రైతులను ఆదుకోవాలన్నారు. లేకుంటే ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఇంటి వెంకట్‌రెడ్డి, నాయకుడు కాసర్ల మాధవరెడ్డి పాల్గొన్నారు.


కడవెండి పాఠశాలలో క్రీడాదుస్తులు అందిస్తున్న కిరణ్‌రెడ్డి


వెల్దండ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

స్వయం పాలన దినోత్సవంలో పలువురు వక్తలు

శివునిపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

దేవరుప్పుల, మార్చి 3: ప్రతిఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని దుగ్గింపూడి నిర్మల–శౌరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కిరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కడవెండి ప్రభుత్వ ఉ న్నత పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. కిరణ్‌రెడ్డి మాట్లాడు తూ తాను చదివిన విద్యను సమాజానికి, దేశానికి ఉపయోపడేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పుట్టిన ఊరును, కన్న తల్లిదండ్రులను మరవొద్దన్నారు. అనంతరం ట్రస్ట్ ద్వారా పాఠశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు క్రీడాదుస్తులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్ల నాగుల రాజు, పీఎస్ ప్రధానోపాధ్యాయుడు రమేశ్, పీడీ రేణుక పాల్గొన్నారు.

వెల్దండ పాఠశాలలో స్వయంపాలన

నర్మెట : మండలంలోని వెల్దండ ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ చూపిన వారికి ఎంఈవో అ యిలయ్య బహుమతులను అందించారు.

శివునిపల్లి హైస్కూల్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్ : మున్సిపల్ పరిధిలోని శివునిపల్లి జడ్పీ హైస్కూల్‌లో స్వయం పాలన దినోత్సవం నిర్వహించినట్లు పాఠశాల హెచ్ఎం కుసుమ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. డీఈవోగా అరవింద్, హెచ్ఎంగా హసిని, పీఈటీగా వినయ్, వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతోనే నవసమాజ నిర్మాణం

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

జనగామ చౌరస్తా, మార్చి 3 : నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో డీఎస్సీ 2024 ద్వారా నియమితులైన 114 మంది సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)కు విద్యాశాఖ ఆధ్వర్యంలో వివిధ సబ్జెక్టుల్లో మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఎఫ్ఎల్ఎన్, సీసీఈ ద్వారా మూల్యాంకన విధానం, పాఠ్య ప్రణాళిక, పాఠశాలలో ఉపయోగించే పలు రకాల ఆన్‌లైన్ యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు ఉత్సాహంగా పనిచేయాలన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో బొమ్మరబోయిన శ్రీనివాస్, శిక్షణ కోర్సు కోఆర్డినేటర్ బీ రఘుజీ, సీఎంవో బీ నర్సింహారావు, తోట రాజు, జీసీడీవో గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

వీరవనిత చాకలి ఐలమ్మ
మనుమడికి మెరుగైన వైద్యం అందించాలి

పాలకుర్తి, మార్చి 3: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ మనుమడు, పాలకుర్తి మాజీ సర్పంచ్ చిట్యాల రామచంద్రంకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ డిమాండ్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న రామచంద్రంను సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం పృథ్వీ రాజ్ యాదవ్ మాట్లాడుతూ వీరవనిత చాకలి ఐలమ్మ కుటుంబాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆదుకోవాలన్నారు. వారికి ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అమరుల కుటుంబాలను అవమానిస్తున్నాడని మండిపడ్డారు. కనీసం స్థానిక ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఐలమ్మ కుటుంబ సభ్యులకు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1800 మంది అమరుల కుటుంబాలకు గుర్తించాలన్నారు. అమరుల కుటుంబాల త్యాగాలతోనే సీఎం రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాడనే విషయం మర్చిపోవద్దని ఆయన సూచించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసిన ఆవోపా ప్రతినిధులు

టెన్త్, ఇంటర్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

జఫర్‌గఢ్, మార్చి 3 : మండలంలోని టీబీ తండా శివారు 'మా ఇల్లు ప్రజాదరణ ఆశ్రమం'లో పదో తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (ఆవోపా) మండల శాఖ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్, రబ్బర్లు, స్కేల్స్ పంపిణీ చేశారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో బాధ్యులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకురాలు గాదె పుష్ప ఇన్నయ్య, ఆవోపా మండల అధ్యక్షుడు సురేశ్, ఉపాధ్యక్షుడు బెలిదె చందర్, దొడ్డ రాజ్‌కుమార్, దాంశెట్టి సోమన్న, బోనగిరి శ్రవణ్‌కుమార్, బజ్జూరి సంతోష్, సుధీర్, బెలిదె హరిశంకర్, పట్టూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 3 : స్టేషన్‌ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేశ్‌ను బీఆర్ఎస్ నాయకులతో పాటు దళిత సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు. డివిజన్ కేం ద్రానికి కోర్టును తీసుకు రావడానికి రమేశ్ ఎంతగానో కృషి చేశారని పలువురు పేర్కొన్నారు. దీంతో స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాలకు చెందిన కక్షిదారులు జనగామకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. దీంతో వారికి సమయం ఆదా అవడం తోపాటు ఆర్థికంగా భారం తగ్గుతుందన్నారు. దళితుల సమస్యల పరిష్కారం కోసం రమేశ్ అందిస్తున్న సహకారం మరువలేదని పలువురు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మారకపాక రవి, గుర్రం యాదగిరి, నాయకులు మంద కుమార్, బొడ్డు దయాకర్, సింగపురం జగన్, మాజీ సర్పంచ్ కొయ్యడ మల్లేశ్, ఇల్లందుల సుదర్శన్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పని దినాలు పెంచాలి

పాలకుర్తి, మార్చి 3: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని డీఆర్డీవో ఎన్ వసంత అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి ఉపాధి హామీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వసంత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రోజుకు 50 మంది కూలీలు పనులకు వచ్చేలా చూడాలన్నారు. ఉపాధి హామీలో పని దినాల సంఖ్య పెంచాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఆవుల రాములు, ఎంపీవో రవీందర్, ఏపీవో మంజుల పాల్గొన్నారు.

ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న డాక్టర్ అరెస్ట్


ఏఆర్ సుల్తాన్ రాజా

జనగామ చౌరస్తా, మార్చి 3 : టిప్పుసుల్తాన్ వారసుడినంటూ, ఆ ట్రస్టుకు చైర్మన్ తనే అని ప్రచారం చేస్తూ ఏడుగురి నుంచి రూ.5 కోట్ల 56 లక్షల 75 వేలు తీసుకొని మోసం చేసిన డాక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సోమవారం అర్బన్ సీఐ పీ దామోదర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రంలోని తేని ప్రాంతంలోని కుంభం గ్రామానికి చెందిన అబ్దుల్ రహీమ్(ఏఆర్) సుల్తాన్ రాజా 2010లో రష్యాలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. తొలుత సంగారెడ్డి జిల్లా ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీలో సీఎంవోగా, కరీంనగర్‌లో దేవిశెట్టి హాస్పిటల్, హుస్నాబాద్ రాజా హాస్పిటల్‌లో డాక్టర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత 2020లో జనగామలో తన భార్య కరీమా కతిన్ (కేకే) పేరిట హాస్పిటల్‌ను ప్రారంభించాడు. ఈ క్రమంలో తన వద్దకు వైద్యం కోసం వచ్చే వారితో తను టిప్పుసుల్తాన్ వారసుడినంటూ, ఆ ట్రస్టుకు తనే చైర్మన్ అని సుల్తాన్ రాజా పరిచయం చేసుకుని, తనకు పలు రాజకీయ పార్టీల నాయకులతో మంచి పరిచయాలు ఉన్నాయని నమ్మించే వాడు. జనగామకు చెందిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఎండీ వసీంకు ఇలాగే చెప్పి, కర్ణాటక ప్రభుత్వం నుంచి తన టిప్పు సుల్తాన్ మెమోరియల్ ట్రస్ట్‌కు రూ.700 కోట్లు వస్తున్నాయని ఓ డీడీని చూపించి, ఆ డబ్బులు రావాలంటే జీఎస్టీ కింద కొంత కట్టాల్సి ఉందని నమ్మబలికాడు. జనగామలో మెడికల్ కాలేజీని నిర్మించి కాంట్రాక్ట్ వర్క్ ఇప్పిస్తానని చెప్పి అతడి వద్ద నుంచి రూ. 1.17 కోట్లు తీసుకున్నాడు. 2021లో హైదరాబాద్ ఈఎస్ఐ హాస్పిటల్‌లో ముగ్గురికి ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మేకల ఆనంద్ కుమార్ నుంచి రూ.3.75 లక్షలు, గాదెపాక రాజ్‌కుమార్ నుంచి రూ.5. 50 లక్షలు, సిద్ధార్థ నుంచి రూ.5. 50 లక్షల చొప్పున రూ.14 .75 లక్షలు తీసుకున్నాడు. 2023లో మాజీ కౌన్సిలర్ మారబోయిన పాండుకు తన హాస్పిటల్‌లో ఉన్న ఎక్స్‌రే మిషన్, 10 బెడ్లు, ప్రింటర్స్, కంప్యూటర్‌తో పాటు పరికరాలు ఇస్తానని చెప్పి అతడి నుంచి రూ.5 లక్షలు తీసుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ఆచార్య ఆడిటర్ ఎస్‌వీఎన్ వద్ద నుంచి రూ.1.70 కోట్లు, కరీంనగర్‌కు చెందిన సీహెచ్ అనిల్‌రెడ్డి నుంచి రూ.2 కోట్లు తీసుకున్నాడు. ఏడుగురి నుంచి సుల్తాన్ రాజా రూ.5 కోట్ల 56 లక్షల 75 వేలు తీసుకొని ఆర్థిక నేరాలకు పాల్పడ్డాడు. ఇతడిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేయగా, విచారణలో నిందితుడు నేరం ఒప్పుకున్నాడు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

పాలకుర్తి, మార్చి 3: మండలంలోని బమ్మెర శివారు బాబూనగర్ తండాకు చెందిన యువతి అనుమానాస్పద స్థితిలో సికింద్రాబాద్‌లో మృతి చెందింది. దీంతో స్థానికంగా విషాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బాబూనగర్ తండాకు చెందిన లూనావత్ చలపతి–బుజ్జి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. చిన్న కుమార్తె సంధ్య(20) సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో నర్సుగా పనిచేస్తూ హాస్టల్‌లో ఉంటున్నది. పార్శిగుట్ట సమీపంలోని కమాన్ వద్ద అనుమానాస్పద స్థితిలో సోమవారం ఉదయం మృతి చెందింది. సంధ్యది హత్యా లేక ఆత్మహత్య అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.